క్లుప్తంగా

ముగిసిన మహాయాగం

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివశక్తి పీఠం సమీపంలో నిర్వహిస్తున్న రాజశ్యామల మహాయాగం సోమవారంతో ముగిసింది. లోక కల్యాణార్థం ఈ యాగాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు సోమవారం పూర్ణాహుతి జరిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ద్వారంపూడి కృష్ణారెడ్డి

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ నల్లమిల్లి శృతిరెడ్డి తెలిపారు. గొల్లల మామిడాడ ఆదిత్య పాఠశాలకు చెందిన విద్యార్థి ద్వారంపూడి కృష్ణారెడ్డి అండర్–17 విభాగం జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. శృతిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కృష్ణారెడ్డిని ఆమెతో పాటు ప్రధానోపాధ్యాయుడు వి.రాజేష్, ఉప ప్రధానోపాధ్యాయులు వి.గంగాభవాని అభినందించారు

యోగా పోటీలకు గైట్ విద్యార్థి

రాజానగరం: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యోగా పోటీలకు గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థి అంకిత్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ సోమవారం తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగి అంతర్ కళాశాలల యోగా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా ఈ ఎంపిక జరిగిందన్నారు. డిసెంబర్ ఒకటి నుంచి నాలుగు వరకు చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు జరుగుతాయన్నారు.

భోజనం వితరణ


భోజనం అందిస్తున్న సమితి సభ్యుడు

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో కార్తిక మాసం సోమవారం సందర్భంగా 150 మంది నిరుపేదలకు దాతల సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. సీతానగరానికి చెందిన యర్రంశెట్టి బ్రదర్స్ వీటిని సమకూర్చారు. సేవా సమితి సభ్యులు నేరుగా నిరుపేదల ఇళ్లకు వెళ్లి భోజనం అందించారు.

గ్యాస్ పైపులైన్ మార్పు చేయాలి

పెదపూడి: ఏపీత్రయం గ్రామంలోని పంట పొలాల మీదుగా త్వరలో ఏర్పాటు చేయనున్న కేవీఎస్‌పీ గ్యాస్ పైపులైన్ ఏర్పాటును తక్షణం మార్పు చేయాలని ఆ గ్రామంలోని రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు డి.చినబాబు, కుంటిళ్ల బూరయ్య, టి.వసంతరావు, వెంకటేశ్వరరావు, శివాజీరాజు మాట్లాడుతూ గ్రామంలో ఎకరం పంట భూమి సుమారు రూ.2 కోట్లు ఉందని, ఈ పైపులైన్ వెళ్లడంతో తమ పొలాలు పాడవుతాయన్నారు. ఆర్థికంగా నష్టపోతామన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ, పోరంబోకు భూముల మీదుగా, లేక గ్రామంలో ప్రస్తుతం ఉన్న పైపులైన్ సమీపం నుంచి వేసుకోవాలని వారు కోరారు.

శిక్షణను వినియోగించుకోవాలి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: మగ్గం వర్కులో పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరావు అన్నారు. రంగంపేట మండలం పాతవీరంపాలెంకు చెందిన 50 మంది మహిళలకు మగ్గం వర్కులో ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరికి దివాన్‌చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుంకర వీరాస్వామి, వినీల, తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో మహిళకు రిమాండ్

రంగంపేట: సారా కేసులో ఓ మహిళకు రిమాండ్ విధించినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. జి.దొంతమూరు గ్రామంలో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా మేడిశెట్టి సూర్యకుమారి వద్ద 10 లీటర్ల సారా గుర్తించామన్నారు. ఆమెను అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సీతానగరం: ముగ్గళ్ల ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారుజామున ముగ్గళ్ల – కోరుకొండ రోడ్డులో ఎస్సై కె.చిరంజీవి సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

శంకరా.. శుభకరా..


చంద్రేడులో చంద్రశేఖరస్వామి


పందలపాకలో శివలింగాకారంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు


గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు


సీతానగరం విష్ణాలయంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం
- శైవ క్షేత్రాలకు భక్తుల రద్దీ

రంగంపేట: శంకరా.. శుభకరా అంటూ ఆ నీలకంఠేశ్వరస్వామిని భక్తజనం మనసారా కొలిచింది.. కార్తిక పౌర్ణమి, సోమవారం కలసి రావడంతో అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. చంద్రేడులో కొలువైన శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి విశేష అలంకరణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బిక్కవోలు: పందలపాకలోని కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు గరిమెళ్ల సత్యప్రకాష్ ఆధ్వర్యంలో 12 మంది రుత్విక్కులతో ఆలయ కమిటీ సభ్యులు లక్ష బిల్వార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కొంకుదురు త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుడు రమణశర్మ ఆధ్వర్యంలో కొవ్వూరి లక్ష్మీకాంత్‌రెడ్డి, అనుషా దంపతులు లక్ష బిల్వార్చన పూజలు చేశారు.

ఆలయాలకు భక్తుల రద్దీ

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఆలయాలకు సోమవారం భక్తుల రద్దీ ఏర్పడింది. గాడాలలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం మహిళలతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల పండు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనలో నిర్వహించారు. నిడిగట్ల, మధురపూడి, రాయుడు పాకలు తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

స్వామివారికి అభిషేకాలు

సీతానగరం: కార్తిక మాసం రెండో సోమవారం, మిగులు పౌర్ణమి ఉండటంతో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతానగరం విష్ణాలయంలోని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దీపాల వెలుగులో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకుడు నాగార్జున శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, మునికూడలి, కాటవరం, కూనవరం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

పాలనలో సరికొత్త అధ్యాయం

- సీఎం జగన్‌తో అన్నివర్గాలకు మేలు
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో రాష్ట్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని, తద్వారా అన్నివర్గాలకూ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, ఇనామ్ భూముల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఇనాం భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో భూమిపై హక్కులు లేక సంబంధిత లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి లేని నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు సంబంధించి వారికే సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. దీంతో ఇతర రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల లబ్ధిదారులు భూ క్రయ, విక్రయాలకు సంబంధించిన అన్ని హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో ఇనాం భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగించడంతో పాటు ఇళ్లు నిర్మించుకున్న అర్హులకు నివాస స్థలాలు మంజూరు చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 833 మంది లబ్ధిదారులకు ఇనాం భూములకు సంబంధించిన ఉత్తర్వులు, 2023 సంవత్సరానికి ముందున్న 329 మంది లబ్ధిదారులకు 185.122 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ పట్టాలు, కొత్తగా 63 మంది లబ్ధిదారులకు 17.77 ఎకరాల అసైన్డ్ భూమి పట్టాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా 14 మందికి 897.81 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్ల స్థలాలకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు మంజూరు చేశారు. రంగంపేట జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ వారా కుమారి, ఆర్డీఓ చైత్ర వర్షిణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, నాయకులు కొల్లాటి ఇజ్రాయేల్, రొంగల అప్పాజీ, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, చిర్ల వీర్రాఘవరెడ్డి, రవిశంకర్, బొడ్డు ముత్యాలరావు, లాజర్‌బాబు, వెంకటరెడ్డి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట తహసీల్దార్లు వై.సరస్వతి, కె.పోసిబాబు, దొరకయ్య, డీటీ టి.శశిధర్, మూడు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం


వెలుగుబందలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని వెలుగుబందలో రూ.5 కోట్లు, రాధేయపాలేంలో రూ.2.64 కోట్లతో నిర్మించిన రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీటి ద్వారా పరిసరాలలోని గృహ అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ని అందుతుందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించుటలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయన్నారు. దానివల్లే గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిలో లోవోల్టేజ్ సమస్య ప్రధానమైనదన్నారు. ఇకపై ఈ సమస్యతో ఎవ్వరూ ఇబ్బంది పడకుండా అవసరమైన ప్రతిచోటా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే నూతనంగా ఏర్పడే విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా వెలుగుబందలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలోని 11,300 గృహాలకు కూడా మెరుగైన విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఈఈలు శ్రీధర్‌వర్మ, వై.డేవిడ్, డిప్యూటీ ఈఈలు పి.సన్యాసిరావు, టీవీఎస్ రామకృష్ణ, ఏఈ వైవీవీ సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, అడబాల చినబాబు, కామేశ్వర్రావు, కూటి ప్రసాద్, వడ్డి చిన్న, పెదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి

- జక్కంపూడి విజయలక్ష్మి
- నిడిగట్లలో మహిళలతో సమావేశం


జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో డ్వాక్రా, ఉపాధి హామీ పథకానికి చెందిన మహిళలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మహిళలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ 2019లో ప్రజల ఆశీర్వాదంతో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలతో మహిళలకు చేదోడుగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31.5 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించడం జరిగిందన్నారు. చంద్రబాబు పాలనలో డ్వాక్రా మహిళల కోసం కేవలం రూ.300 కోట్లు విడుదల చేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేల కోట్లు అందించారన్నారు. ఆయనకు మళ్లీ అధికారాన్నిచ్చి మరింత అభివృద్ధి సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమాదేవి, యడ్ల సురేష్, పళ్ల కృష్ణ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా


చక్రద్వారబంధంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్‌ల ద్వారా వివరించారు. ఇంకా ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలుగుతున్నామన్నారు.

రూ.4.8 కోట్లతో అభివృద్ధి పనులు

గడచిన నాలుగున్నరేళ్లలో చక్రద్వారబంధంలో రూ.4.8 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. అదే గత టీడీపీ ప్రభుత్వంలో ఈ గ్రామాభివృద్ధికి కేవలం రూ.15 లక్షలు మాత్రమే వెచ్చించారన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం తమదేనన్నారు. జగన్ పాలన ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సుస్థిర పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, రాజానగరం సర్పంచ్ కుందేటి ప్రసాద్, నాయకులు మార్గాని శ్రీను, వాడ్రేవు శ్రీనివాస్‌కుమార్, ప్రగడ చక్రి, నాగవరపు త్రిమూర్తులు, ఎస్.తాతబ్బాయి, నీలపాల శివరామకృష్ణ, దుర్గా రమేష్, గుత్తుల చంద్రరావు, కురుమళ్ల బాబీ, యాళ్ల నిరీక్షణరావు, ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, నాగవరపు వెంకటరమణ, భానుశంకర్, పితాని రాంబాబు, కోలాటి వెంకన్న, పి.రమేష్ రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- జక్కంపూడి గణేష్
- వంగలపూడిలో గడప గడపకూ..


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి సాధ్యమవుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఆయన సోమవారం వంగలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి.. గత నాలుగేన్నరేళ్లో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయాలంటూ ఆరా తీశారు. గణేష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఏ గడపకూ వెళ్లిన జగనన్న పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మళ్లీ ఈ ప్రభుత్వమే కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరరావు, రంధి సుధాకర్, తిర్నాతి చిన్నా, రంది శంకరం, అంబటి రమణ, పేరిచర్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన


కొంకుదురులో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

బిక్కవోలు: కొంకుదురు బుడతలమామిడి వద్ద బాలాత్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజల అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న కార్తిక వనసమారాధన

మధురపూడి: కార్తికమాసం సందర్భంగా డిసెంబర్ 3వ తేదీన శిష్టకరణ సేవాసమితి ఆధ్వర్యంలో మధురపూడి విమానాశ్రయం సమీపంలోని పుల్లయ్య తోటలో కార్తిక సమారాధన, సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటలకు రమా వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం, కార్తిక దామోదరుని పూజతో కార్యక్రమం ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటలకు అల్పాహారం అనంతరం ఆటల పోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు విందు భోజనాలు, సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభిస్తారు.

పారదర్శకంగా ప్రజాపంపిణీ


సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ కృష్ణారావు తదితరులు

సీతానగరం: ప్రజాపంపిణీ వ్యవస్థలో లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కృష్ణారావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మండల విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాపంపిణీ పారదర్శకంగా జరగాలన్నారు. ఎంఎస్‌వో అచ్యుత కుమారి మాట్లాడుతూ వచ్చే నెల నుంచి బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు ఇస్తామన్నారు. స్థానిక జయరోహన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ కె.రఘుకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఉజ్వల పథకంలో 349 గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. రేషన్ కార్డుపై గ్యాస్ కనెక్షన్ లేని వారు ఈ పథకంలో ఉచితంగా కనెక్షన్ పొందవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పారదర్శకంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సర్వేశ్వరమూర్తి పాల్గొన్నారు.

కమతాల నుంచి ఆవులు మాయం

- రాత్రివేళ తరలించుకుపోతున్న ముఠా
- ఆందోళనలో రైతులు

రాజానగరం: మండలంలో రైతు కమతాల నుంచి ఆవులు అకస్మాత్తుగా మాయమవుతున్నాయి. నోరులేని జీవాలను అక్రమంగా తరలించుకుపోయి, కబేళాలకు అమ్మేసే ముఠా సభ్యులే వీటిని అపహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళ పాలు తీసుకుని, మేత వేసి, మర్నాడు ఉదయం కమతాలకు వచ్చిన రైతులు ఆవులు కనిపించకపోవడంతో బెంబేలెత్తుతున్నారు. నెలల వయసులో ఉండే దూడలను మాత్రం వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల ఆంబోతులను కూడా తరలించుకుపోతున్నారు. రెండు రోజుల క్రితం రాజానగరం సామిల్లుల వద్ద బి.శ్రీరాములు అనే వ్యక్తి కట్టేసిన మూడు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు వ్యాన్‌లో వచ్చిన తరలించుకుపోయారు. వ్యానుకు ఉన్న నంబరు ప్లేటుకు నంబరు కనిపించకుండా క్లాత్ కట్టేసినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఫరిజల్లిపేటకు చెందిన బత్తిన వీరవెంకట్రావుకు చెందిన ఒక ఆవు, చక్రద్వారబంధం పాల వ్యాపారి బుజ్జికి చెందిన ఒక ఆవు, కంచుపట్ల లక్ష్మణరావుకు చెందిన రెండు ఆవులు వారం రోజుల వ్యవధిలో రాత్రికి రాత్రి మాయమైపోయాయి. రెండు మూడు నెలల వ్యవధిలో ఈనిన ఆవులనే దుండగులు లక్ష్యంగా పెట్టుకున్నారని బాధితులు వాపోతున్నారు.

న్యాయం చేయాలని వినతి

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన'కు ఒక వినతి వచ్చినట్టు తహసీల్దార్ ఎస్.దొరకయ్య తెలిపారు. రంగంపేటకు చెందిన పుట్టా వీరయ్యమ్మ తన పొలం సరిహద్దు గొడవలో కొందరి నుంచి ప్రాణహాని ఉందని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, తగిన న్యాయం చేయాలని పేర్కొంది.

గ్రామాల్లో క్రీడా సంబరాలు

మధురపూడి: గ్రామీణ ప్రాంతంలోని యువతను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడం కోసం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకూ 50 రోజులు క్రీడా సంబరాలు జరుగుతాయన్నారు. ఆసక్తిల కలవారందరూ సంబంధిత సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

పథకాలపై అవగాహన పెంచుకోవాలి


పందలపాకలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు, అధికారులు

బిక్కవోలు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివ రామకృష్ణరాజు అన్నారు. సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఊలపల్లి, పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పందలపాకలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.